క్లుప్తంగా

చెత్తాచెదారం తొలగింపు



తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఐదో వార్డులో డ్రెయినేజీ అధ్వానంగా మారడంలో ఈనెల 12న గురువారం 'కంపు కొడుతున్న డ్రెయినేజీ 'శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీలో చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేయించారు.

ముధోల్ ఎస్సైగా సంజీవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

ముధోల్: ముధోల్ ఎస్సైగా సంజీవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మల్లేశ్ బదిలీపై వెళ్లగా నిర్మల్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి సంజీవ్ ముధోల్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఆయనను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఎస్సై పేర్కొన్నారు.

16న ఇసుక వేలం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 16న సోమవారం ఉదయం 11 గంటలకు ఇసుక డంపునకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ జానకీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల లక్ష్మణచాంద సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 14 ట్రాక్టర్ల ఇసుక (42 క్యూబిక్ మీటర్ల)ను గుర్తించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ ఇసుక ప్రారంభ ధర రూ.1800 నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

భారతీయ భాషా దినోత్సవం



రాష్ట్రాల సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం భారతీయ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్నారు. రాష్ట్రాల అధికారిక భాషల్లో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చామన్‌పెల్లి గ్రామ సమీపంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆర్ఐ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ జానకికి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

నేతకానీలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో వెంకటేశ్

కడెం: నేతకానీలకు నామినేటెడ్ పదవులు కేటాయించి ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులానికి ప్రాధాన్యమిస్తూ.. ఎస్సీ(ఏ)లో చేర్చాలని నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుల్లె వెంకటేశ్‌నేత పేర్కొన్నారు. గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

తిరుపతిలో సత్కారం



రాఘవశర్మను సత్కరిస్తున్న దృశ్యం

ఖానాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానంలోని ఆడిటోరియంలో ఖానాపూర్‌కు చెందిన పండితులు కీర్తి రాఘవశర్మకు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. వేద జ్యోతిష్య న్యూమరాలజీ శాస్త్ర పండితులైన ఖానాపూర్ వాసి కీర్తి రాఘవశర్మను గురువారం తిరుపతికి ఆహ్వానించి ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మెంబర్ నర్సింహస్వామి చేతుల మీదుగా సత్కరించారు.

యోగా సాధనతో ఆరోగ్యం..

- మండలానికి ఇద్దరు శిక్షకుల నియామకం
- నేర్చుకునేందుకు ముందుకొస్తున్న విద్యార్థులు



కుంటాలలో సాధన చేస్తున్న చిన్నారులు



కుంటాల బీసీ వసతిగృహంలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

కుంటాల: ఆధునికయుగంలో శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా చాలా మంది వివిధ వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ సంపాదించిన సొమ్మును పోగొట్టుకుంటున్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వం ప్రజలను మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు యోగా శిక్షణకు చర్యలు చేపట్టింది. ఆయుష్ (నామ్) ఆధ్వర్యంలో జిల్లాలోని మండలానికి ఇద్దరు చొప్పున(పురుషుడు, స్త్రీ) యోగా శిక్షకులను నియమించారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో భాగంగా కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమం తీసుకురాగా.. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఆయుష్ విభాగం కేంద్రాలు ఏర్పాటు చేసి మండలానికి ఒక పురుష, ఒక మహిళ ట్రైనర్‌ను నియమించింది. చిన్న నుంచి పెద్దల వరకు ఎవరైనా ఈ కేంద్రాలకు వెళ్తే.. అక్కడ శిక్షకులు యోగా సాధన చేయిస్తారు.

యోగాతో లాభాలు..

- నిత్య యోగా సాధనతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా మారుతారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడుతుంది. ఒత్తిడి తగ్గి మన శరీరంలో సమతౌల్యం బాగుంటుంది.
- ఆసనాలు వేయడం ద్వారా శారీరక నిరోధక శక్తి పెరుగుతుంది.
- అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉత్సాహంగా జీవనం సాగిస్తాం.
- రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్.. ఇలా అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఈ కేంద్రాలకు ఆరోగ్యవంతులుగా మారవచ్చు. చిన్నారులతోపాటు వృద్ధులకు యోగా నేర్పిస్తారు.

జిల్లాలో 18 మంది శిక్షకుల నియామకం..

ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో నవంబర్ 17న 18 మంది యోగా శిక్షకులను నియమించారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణ, గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. త్వరలో కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. మామడ మండలంలోని పొన్కల్, నిర్మల్, సోన్ మండలంలోని కడ్తాల్, కుంటాల, దిలావర్‌పూర్, తానూర్, భైంసా మండలంలోని దేగాం, బాసర, కుభీర్ మండలంలోని పల్సి గ్రామాల్లో ఇద్దరు చొప్పున శిక్షకులను నియమించినట్లు అధికారులు తెలిపారు.

శిక్షణ కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం చిన్న నుంచి పెద్దల వరకు యోగా సాధన చేయించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శిక్షకుల్లో పురుషులకు నెలకు రూ.8వేలు, స్త్రీలకు రూ.5వేలు అందిస్తున్నారు. వీరికి ప్రతి సెషకు రూ.250 చొప్పున, శిక్షకులైన స్త్రీలు నెలకు 20, శిక్షకులైన పురుషులు 30 సెషన్స్ (శిక్షణ తరగతులు) తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాలకు శిక్షకులను నియమించి.. యోగా సాధన ప్రారంభమయ్యేలా చూస్తానని అధికారులు పేర్కొన్నారు.

నేర్చుకుంటున్నాం



కుంటాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రానికి వచ్చి యోగా సాధన నేర్చుకుంటున్నాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

– శర్విక, అశృత

ఆసనాలు నేర్పిస్తున్నాం



యోగాపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఆసనాలు నేర్పిస్తున్నాం. ప్రజలు వచ్చి నేర్చుకుంటున్నారు.

– మౌనిక, యోగా శిక్షకురాలు, కుంటాల

అందరూ ఆరోగ్యంగా ఉండాలనే..



ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం యోగా శిక్షణకు చర్యలు చేపట్టింది. యోగా సాధన, ధ్యానంతో కలిగే ప్రయోజనాలను శిక్షకులు వివరిస్తున్నారు. దీంతో ఒత్తిళ్లు దూరమవుతాయి.

– జి.గంగాదాస్, జిల్లా ఇన్‌చార్జి, ఆయుష్

అట్టహాసంగా సీఎం కప్ పోటీలు



నిర్మల్‌లో కబడ్డీలో విజయం సాధించిన జట్టు



మామడ: గెలుపొందిన వాస్తాపూర్ జట్టు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఈనెల10 నుంచి నిర్వహిస్తున్న పట్టణ స్థాయి సీఎం కప్ పోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీలో బాలుర విభాగంలో దీక్ష కళాశాల విద్యార్థులు ప్రథమ, బాలికల విభాగంలో నిర్మల్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఖోఖోలో బాలుర, బాలికల విభాగాల్లో రవి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో వశిష్ఠ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో, బాలికల విభాగంలో రవి హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 16 నుంచి 20వరకు జిల్లాకేంద్రంలో నిర్వహించే జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొంటారు. అనంతరం విజేతలకు మున్సిపల్ కమిషనర్ ఖామర్ అహ్మద్ క్రీడాపత్రాలు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, పేటా జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేశ్, నిర్వాహకులు వన్నెల భూమన్న, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు పాల్గొన్నారు.

మామడ: మండలస్థాయి సీఎం కప్ పోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీలో బురదపల్లిరాశిమెట్ల జట్టు, ఖోఖోలో కొరిటికల్ జట్టు, వాలీబాల్‌లో వాస్తాపూర్, బాలికల విభాగంలో మామడ జట్టు, ఖోఖోలో కొరిటికల్ జట్లు విజేతలుగా నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, పీఈటీ పోశెట్టి, లక్ష్మి పాల్గొన్నారు.

తానూరు: మండలకేంద్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎంకప్ పోటీలు గురువారం ముగిశాయి. ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన యువకులకు ఎంఈవో నరేందర్, అధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సాయిబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సీఎం కప్ పోటీలు ముగిశాయి. కబడ్డీలో కుభీర్ జట్టు, వాలీబాల్‌లో పత్సితండా, ఖోఖోలో ఫకీర్ నాయక్ తండాలు గెలుపొందాయి. ఈ జట్లు జిల్లాస్థాయిలో పాల్గొంటాయని అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఎస్సై పి.రవీందర్, ప్రధానోపాధ్యాయులు జె.సాయన్న, పీడీ క్రాంతికుమార్, పీఈటీ దేవిదాస్, ఎంఈవో విజయ్ తదితరులు ఉన్నారు.

నర్సరీ పనుల్లో వేగం పెంచాలి

తానూరు: పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న నర్సరీ నిర్వహణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నర్సరీలో కవర్లలో మట్టి నింపిన చోట విత్తనాలు నాటించాలని పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం చేపట్టే సర్వేపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లింగంమూర్తి, ఎంపీవో నసిరుద్దీన్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలలో నర్సరీ పనులను ఉపాధిహామి టీఏలు పరిశీలించారు.గురువారం మండలంలోని మల్లాపూర్, పార్పెల్లి,తాండా,ధర్మారం,వంటి ఉపాధిహామి పథకంలో గ్రామాలలో చేపడుతున్న నర్సరీల పనులను ఈజీఎస్ టీఏలు దినేష్, భీమ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలన్నారు.మట్టిని నింపే ప్రకియ త్వరగా పూర్తి చేసేలాగా చర్యలు చేపట్టాలని ఎఫ్ఏలకు సూచించారు.ఇందులో ఈఏలు దినేష్,భీమ్,ఎఫ్ఏ ఆశన్న ఉన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

భైంసా: బాసరలోని జీఎస్ గార్డెన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. దీనికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేశ్ హాజరవుతారని వెల్లడించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, పదాధికారులు, మీడియా ప్రతినిధులు పార్టీ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

సోయా కొనుగోళ్లు ప్రారంభించాలి

ముధోల్: మండలంలోని బోరిగాం కేంద్రంలో సోయా కొనుగోళ్లను మూడు రోజులుగా నిలిపివేశారని.. వెంటనే తిరిగి ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్యాక్స్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా పంటను కొనుగోలు చేస్తుందన్నారు.ప్రైవేటులో మార్కెట్ ధర తక్కువగా ఉండడంతో క్వింటాలుకు రూ.వెయ్యి నష్టపోతున్నారని.. అధికారులు కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు ఘన సన్మానం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రవంతి, సవిత, స్వప్న, దీక్ష జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాశ్ తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు, నాయకులు సన్మానించారు. ఉపాధ్యాయులు నారాయణ్, గంగాధర్, నాయకులు గంజాల గంగాధర్, మంద భాస్కర్, ఎల్లన్న, ప్రమీల ఉన్నారు.

భైంసారూరల్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని టీఎంఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గణిత పోటీల్లో మండలంలోని తిమ్మాపూర్ స్కూల్ విద్యార్థిని నితీష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రతిభ కనబరిచిన నితీషను గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. భైంసా పట్టణానికి చెందిన లలిత-సురేశ్, రోహిత్-స్వాతి మయూరి సూపర్‌మార్కెట్ తరఫున 70 మంది విద్యార్థులకు టై, బెల్టు, షూలను పంపిణీ చేశారు. దాతలను వీడీసీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు వినాయక్‌రెడ్డి, విశ్వనాథ్, సుభాష్ ఉన్నారు.

అంబులెన్సు ఏర్పాటుకు వినతి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో 108 అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అత్యవసర వేళ ఇతర ప్రాంతం నుంచి అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, ప్రణీత్, అర్షద్, లాజర్, సాయికృష్ణ, అజయ్, నరేశ్, సంజయ్, వంశీ, దయాకర్ తదితరులున్నారు.

'ప్రభుత్వంపై విమర్శలు సరికాదు'

కడెం: కనీసం రేషన్‌కార్డులు ఇవ్వలేని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గురువారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, వేలాదిగా ఉద్యోగాలను భర్తీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు దుర్గం రాజేశ్, మోరపాక రాజు, శేఖర్, సాయికుమార్, శివ తదితరులున్నారు.

అంబులెన్స్ ఏర్పాటుపై హర్షం

కడెం: మండలానికి 108 అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి గురువారం కడెంలో అంబులెన్స్ షెడ్డు ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భూషణ్, శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్, సత్యం, రాజన్న ఉన్నారు.

'ఓపెన్'లో దరఖాస్తులకు గడువు పెంపు

లక్ష్మణచాంద: ఓపెన్ పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం స్పెషల్ ఫేజ్ దరఖాస్తుల గడువు ఈనెల 16 వరకు పెరిగినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రాజునాయక్, సహ కోర్డినేటర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఎస్సైకి సన్మానం

నర్సాపూర్ (జి): మండల నూతన ఎస్సైగా పి.సాయికిరణ్ బాధ్యతలు చేపట్టారు. ఉందనితండా, సాయినగర్ తండా కాంగ్రెస్ నాయకులు గురువారం ఎస్సైని శాలువాతో సన్మానించారు. రాథోడ్ ఉత్తం, రాథోడ్ బలరాం, రాథోడ్ శీను, తానాజీ, జాదవ్ రాజేశ్, జాదవ్ సంతోష్ తదితరులున్నారు.

తప్పులుంటే బీఎల్‌వోల దృష్టికి తీసుకెళ్లాలి



ముధోల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో

లోకేశ్వరం: ఓటరు జాబితాలో తప్పులుంటే బీఎల్‌వోల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో నూతన ఓటరు జాబితా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తహసీల్దార్ మోతీరాం, ఎంపీఈవో సోలమాన్‌రాజ్, నాయకులు రత్నాకర్‌రావు, జయసాగర్‌రావు, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

ముధోల్: ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, వార్డు వివరాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఎంపీడీవో శివకుమార్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 19 గ్రామపంచాయతీల్లో 166 వార్డులున్నాయని పేర్కొన్నారు. వార్డుల వారీగా ఓటర్ జాబితా వివరాలను ప్రదర్శించారు. సీనియర్ అసిస్టెంట్ నిజాముద్దీన్, కోరి పోతన్న, రావుల శ్రీనివాస్, అజీజ్, కిషన్, కాసరం శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన భోజనం అందించండి'

- డీఈవో రామారావు



వంటగది పరిశీలిస్తున్న డీఈవో రామారావు

ముధోల్: పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలను డీఈవో పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలోని వంట గదిని, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించి.. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

తానూరు: జీవితంలో మనకు ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎస్సై రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని మహలింగి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ, మత్తుపదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఆత్మహత్యలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు వస్తే కుంగిపోకుండా ఆత్మీయులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత చదవులు చదవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

నిర్మల్‌రూరల్: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం మండలంలోని ముజ్గి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను ఉపాధ్యాయులు అందించారు. ప్రవేశ పరీక్షలో ఎంపికయ్యేలా పాఠశాల పనివేళల అనంతరం ప్రత్యేక తరగతులు బోధిస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నర్సారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు రవి, నరసయ్య, ప్రకాశ్‌రావు, సాయన్న, వనిత తదితరులున్నారు.

విద్యుత్ మోటార్ అపహరణ

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో నాయిడి పెద్ద రాజేశ్వర్‌కు చెందిన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పెద్ద రాజేశ్వర్.. న్యూవెల్మల్ గ్రామానికి చెందిన జగన్‌రావు తోటను కౌలుకు తీసుకున్నాడు. సరస్వతి కాల్వకు విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి పంటకు నీటిని అందించాడు. ప్రస్తుతం సరస్వతి కాల్వకు నీరు నిలిచిపోవడంతో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్లారు. గురువారం వెళ్లి చూసేసరికి రాజేశ్వర్ మోటార్ లేదు. దీని విలువ రూ.22 వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

'నవోదయ' ఏర్పాటుకు కృషి చేయాలి

భైంసాటౌన్: ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం కేటాయించకుండా వివక్ష చూపిందని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్త డా కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్ అన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా దత్త జయంతి ఉత్సవాలు



కల్లూర్‌లో విద్యుత్ కాంతులతో బాబా ఆలయం

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో దత్త జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం బాబాకు అభిషేకం, అలంకరణ, అర్చన పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి మహిళలు సాయి నామస్మరణ చేస్తూ ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



బాసరలో స్వామివారు

భైంసా: బాసరలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయుడికి ఉదయం అభిషేకం, పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయ, విష్ణు సహస్రనామాలు, కీర్తనలు ఆలపించారు. సేవా సమితి ఆధ్వర్యంలో పలువురు దత్తాత్రేయుడి మాల స్వీకరించారు. ఈనెల 15 వరకు దత్త జయంతి ఉత్సవాలు కొనసాగుతాయని సేవా సమితి సభ్యులు తెలిపారు.

ప్లేట్లు అందజేత



ప్లేట్లు అందిస్తున్న మిత్రమండలి సభ్యులు

కుభీర్: మండలకేంద్రంలోని విఠలేశ్వరస్వామి మందిరానికి ఉద్యోగ మిత్రమండలి వారు 300 ప్లేట్లను విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ, ఉపాధ్యక్షుడు రాజన్న, ఉద్యోగ మిత్రమండలి అధ్యక్షులు చిక్కాల మారుతి, సభ్యులు సట్ల గంగాధర్, పోతన్న, ప్రభాకర్, వి.నాగేశ్, పి.లక్ష్మణ్ ఉన్నారు.

ఫుడ్ ఫెస్టివల్

భైంసా: బాసరలోని హంసవాహినీ పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. 20 రకాల పిండి వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు సంప్రదాయ వంటకాల తయారీపై నేర్చుకునేలా ఆసక్తి కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.